రజతోత్సవ సభకు వెళ్లాడని ఇందిరమ్మ ఇల్లు కట్

- **ఇల్లు ఇవ్వకపోతే ఆత్మహత్యే**
  దిక్కంటున్న బాధితుడు సాయి

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయకపోతే ఆత్మహత్యకు పాల్పడతానంటూ పురుగుల మందు డబ్బా చూపిస్తున్న సాయి

గుర్రంపోడ్, మే 5: కాంగ్రెస్ సర్కార్ ఓ నిరుపేదపై కక్షగట్టింది. బీఆర్ఎస్ సభకు వెళ్లాడనే కారణంతో ఇందిరమ్మ ఇల్లు కట్ చేసింది. ఈ ఘటన నల్లగొండ జిల్లాలో చోటుచేసుకున్నది. గుర్రంపోడ్ మండలం పాల్వాయికి చెందిన ముండ్ల సాయిది నిరుపేద కుటుంబం. ఇందిరమ్మ ఇంటి కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోగా అధికారులు విచారణ చేపట్టి ఇల్లు మంజూరు చేశారు. కేసీఆర్ అభిమాని అయిన ముండ్ల సాయి గత నెలలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు స్వచ్ఛందంగా హాజరయ్యాడు. ఇది తెలిసిన కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు జాబితా నుంచి అతని పేరు లేకుండాచేశారు. కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న సాయి తన పేరును జాబితా నుంచి ఎందుకు తొలగించారని పంచాయతీ కార్యదర్శి యాదయ్యను అడిగితే.. రెండో విడతలో చూద్దామని చెప్పినట్టు బాధితుడు వాపోయాడు. ఈ విషయమై కాంగ్రెస్ నేతలను అడిగితే 'నువ్వు బీఆర్ఎస్ మీటింగుకు వెళ్లినవ్ కదా? బీఆర్ఎస్ వాళ్లకు ఇండ్లు ఇవ్వం' అని చెప్పినట్టు సాయి పేర్కొన్నాడు. తాను నిరుపేదనని, ప్రభుత్వం స్పందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయకపోతే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం తప్ప తనకు వేరే మార్గం లేదని పేర్కొన్నాడు.

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం బండౌతాపురంలో ఇందిరమ్మ ఇండ్లపై ఎమ్మెల్యే నాగరాజుతో వాగ్వాదానికి దిగిన స్థానికులు

ఎమ్మెల్యేకు 'ఇందిరమ్మ ఇండ్ల' సెగ

- **లబ్ధిదారుల జాబితాపై**
  నాగరాజుతో వాగ్వాదం

వర్ధన్నపేట, మే 5 : ప్రజాప్రతినిధులకు ఇందిరమ్మ ఇండ్ల సెగ తగులుతున్నది. అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నవారికే పక్కా గృహాలు మంజూరవుతున్నాయని గ్రామాలకు వెళ్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రజలు వాగ్వాదానికి దిగుతున్నారు. సోమవారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం బండౌతాపురంలో జరిగిన భూభారతి రెవెన్యూ సదస్సుకు హాజరైన ఎమ్మెల్యే నాగరాజు వద్ద గ్రామానికి చెందిన పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక జాబితాలో అవకతవకలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని వారు ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగారు. బండౌతాపురంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగిన దృశ్యాలను ఫొటోలు తీస్తున్న జర్నలిస్టుపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. గుర్తింపు కార్డు చూపించాలని నిలదీశారు.

240 మెడికల్ సీట్లకు కోత

సీఎంకు ఢిల్లీ మోజు... సీఎంవోలో ఫైళ్లకు బూజు

- **15 నెలల కాంగ్రెస్ పాలనలో వందల ఫైళ్లు పెండింగ్**
- **అధికారుల మధ్య సమన్వయ లోపం, అవగాహనా రాహిత్యం**
- **పెండింగ్ ఫైళ్ల నివేదిక కోరిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్, మే 5(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచింది. పరిపాలనను సీఎంవోకు వదిలిపెట్టి సీఎం రేవంత్‌రెడ్డి పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్, లేదంటే ఢిల్లీకి వెళ్లే ఫ్లైట్ మోడ్‌లోనే కాలం గడుపుతున్నారు. ఎక్కే విమానం.. దిగే విమానం అన్నట్టుగానే ఆయన 15 నెలల పరిపాలన సాగడంతో పాలనాపరమైన ఫైళ్లకు బూజు పట్టినట్టు సచివాలయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. సీఎంవో అధికారుల మధ్య సమన్వయ లోపం, అవగాహన రాహిత్యం, పనితీరులో జాప్యం తదితర కారణాలతో వందలాది ఫైళ్లు దీర్ఘకాలంగా పెండింగు ఉన్నట్టు ఇటీవలి తనిఖీల్లో బయటపడ్డట్టు తెలిసింది. 2024-25 విద్యా సంవత్సరానికిగాను రాష్ట్రానికి 240 మెడికల్ సీట్లు కొత్తగా రావాల్సి ఉండగా, సీఎంవోలోని ఓ అధికారిణి నిర్లక్ష్యం మూలంగా అవి రద్దయినట్టు గుర్తించిన అధికారులు సీఎంకు సమాచారం అదించినట్టు తెలిసింది. ఈనేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి పెండింగ్ ఫైళ్ల మీద ఆరా తీయగా దిగ్భ్రాంతికర విషయాలు బయటపడ్డట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఏడుగురు కార్యదర్శులు ఉన్నప్పటికీ, ఒకరితో ఒకరికి పొంతన కుదరకపోవడం, వివిధ శాఖల హెచ్‌వోడీలతో సమన్వయం చేసుకోవడంలో నిర్లక్ష్యం, వారిని లీడ్ చేసే నాయకుడు లేకపోవడం తదితర కారణాలతో ఎక్కడి ఫైళ్లు అక్కడే మూలకు పెట్టినట్టు తెలిసింది. ప్రధానంగా సీఎంవోలోని ఇద్దరు కీలక సెక్రటరీల వద్ద పెద్ద ఎత్తున పెండింగ్ ఫైల్స్ పేరుకుపోయాయని గుర్తించినట్టు తెలిసింది. ఆ ఇద్దరు సెక్రటరీలు చూస్తున్న రెండు శాఖలు కూడా సీఎం దగ్గర ఉన్న శాఖలే కావడంతో సీఎం వారి పట్ల కొంత ఉదాసీనతతో ఉన్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుతానికి వారిని వదిలేసి మిగిలిన సెక్రటరీలను మార్చాలని నిర్ణయించినట్టు సమాచారం.



కార్యదర్శులను కుదించాలని..

ఏడుగురు కార్యదర్శుల తోనే సీఎంవో వివాదాస్పదంగా మారిందనే అనుమానంతో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి కార్యదర్శుల సంఖ్యను ఐదుకు కుదించాలని నిర్ణయించినట్టు తెలిసింది. అందులో భాగంగా సీఎంవో నుంచి ఇటీవల ఒకేసారి ముగ్గురు సెక్రటరీలను బదిలీ చేశారు. సీఎం సెక్రటరీగా ఉన్న ఐపీఎస్ అధికారి షానవాజ్ ఖాసింను రాష్ట్ర ఔషధ నియంత్రణ విభాగం డైరెక్టర్ జనరల్‌గా బదిలీ చేశారు. సీఎంవో సంయుక్త కార్యదర్శిగా ఉన్న సంగీత సత్యనారాయణను వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోగా పంపించారు. సీఎంవో సెక్రటరీగా ఉన్న సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నఫళంగా సీఎంవోలో తన ఛాంబర్ ఖాళీ చేసి మాతృశాఖ అటవీశాఖకు తిరిగి వెళ్లిపోయినట్టుగా తెలిసింది. అయితే, ఆయన్ను రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా నియమించేందుకు ప్రభుత్వం సిఫార్సు చేసినట్టు ప్రచారం జరుగుతున్నది. ఆ ఫైల్ ప్రస్తుతానికి గవర్నర్ వద్ద ఉన్నట్టు సమాచారం. ఆయన స్థానంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేవస్ శ్రీనివాసరాజును సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించారు. ఐటీ, పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్‌గా ఉన్న జయేశ్ రంజన్‌ను సీఎంవోలోకి తీసుకొచ్చారు. వీరితోనే సీఎంవోను నిర్వహించాలనే ఆలోచనతో సీఎం ఉన్నట్టు తెలిసింది. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ఫైళ్ల నివేదిక తనకు ఇవ్వాలని సీఎంవో ప్రిన్సిపల్ కార్యదర్శి శ్రీనివాసరాజును రేవంత్‌రెడ్డి ఆదేశించినట్టు తెలిసింది. ఫైళ్ల క్లియరెన్స్ కోసం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆయన్ను కోరినట్టు సమాచారం.

స్టేట్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి జీ చంద్రశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. గవర్నర్ ఆమోదంతో ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఆయన సీఎం పేషీలో ముఖ్య కార్యదర్శిగా, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌ఆఫ్ ఫారెస్ట్‌గా, రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం బోరేగావ్‌కు చెందిన చంద్రశేఖర్ రెడ్డి 1991లో విధుల్లో చేరారు.

కమిషనర్ల నియామకం పెండింగ్..

సమాచార కమిషనర్ల నియామకంపై స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, ప్రజా సంఘాల బాధ్యుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. వీరికి రాజకీయ నేపథ్యం ఉన్నదని పలువురి అభ్యంతరాలతో గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదని తెలుస్తున్నది.

రెండు విభాగాలుగా పురపాలక శాఖ

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ) : మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్(ఎంఏయూడీ) శాఖను రెండు విభాగాలుగా చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీవో జారీ చేసింది. పరిపాలనా సౌలభ్యం కోసం ఎంఏయూడీని మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్లుగా ఏర్పాటుచేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నది. మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం కింద హెచ్ఎండీఏ, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, ఓఆర్ఆర్ పరిధిలోని జీహెచ్ఎంసీతోపాటు అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, హెచ్ఎండీఏ పరిధిలోని హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్బీ, ఎమ్మార్డీసీఎల్, హెచ్ఎంఆర్ఎల్, హెచ్ఆర్డీసీఎల్, హెచ్‌జీసీఎల్, ఎఫ్‌సీడీఏ, హైడ్రా, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్, రెరా అండ్ రెరా అప్పిలేట్ ట్రిబ్యునల్ ఉండనున్నాయి. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ కింద ఓఆర్ఆర్ వెలుపలి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ ఉంటాయి. టీయూఎఫ్ఐడీసీ, ఎన్ఐయూఎం, మెప్మా, మున్సిపల్ సర్వీసెస్ ఉంటాయి.

మొదటి సంతకమే మోసం!

- **వేతనాలు పెంచినట్టే పెంచి టీచర్లను దగా చేసిన ప్రభుత్వం**
- **10 నెలలుగా పాత కథే పునరావృతం**
- **12 నెలల్లో మొత్తం రూ.28 కోట్లు ఎగ్గొట్టిన రేవంత్‌రెడ్డి సర్కార్**
- **రాష్ట్ర ప్రభుత్వంపై 3,989 మంది మినీ అంగన్‌వాడీ టీచర్ల ఆక్రోశం**

మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న మినీ అంగన్‌వాడీ టీచర్లు (ఫైల్)

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు మంత్రి సీతక్క బాధ్యతలు స్వీకరించిన వెంటనే మినీ అంగన్‌వాడీల అప్‌గ్రేడేషన్ ఫైల్‌పై మొదటి సంతకం చేశారు. తద్వారా తొలి 3 నెలలపాటు పెంచిన వేతనాలను వర్తింపజేశారు. నిరుడు జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో ప్రధాన సెంట్రల్ టీచర్లతో సమానంగా వారి ఖాతాల్లో రూ.13,650 చొప్పున వేతనాన్ని జమచేశారు. దీంతో రాష్ట్రంలోని 3,989 మంది మినీ అంగన్‌వాడీల టీచర్లు మురిసిపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తమ బతుకులు బాగుపడ్డాయని సంబురంలో మునిగితేలారు. కానీ, ఇంతలోనే మళ్లీ కథ మొదటికొచ్చింది. ఏప్రిల్, మే నెలల్లో తిరిగి పాత పద్ధతిలో రూ.7,800 వేతనం మాత్రమే వేశారు. దీనిపై ఆందోళనకు గురైన మినీ అంగన్‌వాడీ టీచర్లు.. వెంటనే ఆ విషయాన్ని మంత్రి సీతక్కతోపాటు మహిళాశిశు సంక్షేమ శాఖ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మళ్లీ జూన్, జూలై మాసాల్లో పెంచిన వేతనాన్ని జమచేశారు. ఆ తర్వాత నుంచి వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. 2024 ఆగస్టు నుంచి 2025 మే వరకు (గత 10 నెలలుగా) పాత జీతాలే ఇస్తున్నారు. అలా 12 నెలల్లో ఒక్కో టీచర్‌కు రూ.5,850 చొప్పున మొత్తం రూ.28 కోట్లు ఎగ్గొట్టారు. దీనిపై మంత్రి, ఉన్నతాధికారులకు విన్నవిస్తే సాంకేతిక కారణాలను సాకుగా చూపుతూ తప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లో అంగన్‌వాడీ టీచర్లు

తమకు తక్కువ వేతనాలు ఇస్తుండటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని మినీ అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని మంత్రి సీతక్కతోపాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తే ఆన్‌లైన్‌లో టెక్నికల్ సమస్యల కారణంగా మినీ అంగన్‌వాడీల అప్‌గ్రేడేషన్ పూర్తి కాలేదంటూ తప్పించుకు తిరుగుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీల అప్‌గ్రేడ్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

మార్కెట్లలో కార్బైడ్‌ను నియంత్రించండి

- **అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు**

హైదరాబాద్, మే 5 (నమస్తేతెలంగాణ): మామిడికాయలు త్వరగా పక్వానికి రావడానికి కార్బైడ్‌ను వాడకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ సురేంద్రమోహన్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. మంత్రి తుమ్మల ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్‌రావు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాజేశ్వరి, మార్కెటింగ్ అధికారులతో కలిసి జాంబాగ్, బాటసింగారం పండ్ల మార్కెట్లలో తనిఖీలు చేపట్టారు. ఎథోఫోన్, ఎథిలిన్ రసాయనాలను వాడుతున్నట్టు గుర్తించి సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు.

ఈసారి 12.46 లక్షల మందికే..

- **మధ్యాహ్న భోజనం పథకానికి కేంద్రం అనుమతి**

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ) : సర్కారు బడుల్లోని విద్యార్థులకు అందజేసే మధ్యాహ్న భోజన పథకం రాష్ట్రంలోని 12,46,598 మంది విద్యార్థులకు వర్తింపజేయనున్నారు. 2025-26 విద్యాసంవత్సరానికి 25,901 పాఠశాలల్లో కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పీఎం పోషణ్ ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు (పీఏబీ) మినట్స్‌ను కేంద్రం తాజాగా విడుదల చేసింది. 17,712 ప్రాథమిక బడుల్లో 7,88,724 మంది విద్యార్థులు, 8,189 ప్రాథమికోన్నత బడుల్లోని 4,57,874 మందికి మధ్యాహ్న భోజనం సమకూర్చేందుకు ఆమోదం తెలిపింది. 1-8 తరగతుల విద్యార్థులకు రూ.307 కోట్లకు కేంద్ర వాటా రూ.192కోట్లు కాగా, రూ. 115 కోట్లుగా ఖరారుచేసింది.

'దోస్త్' హెల్ప్ డెస్క్

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ) : డిగ్రీ ఫస్టియర్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే దోస్త్‌కు దరఖాస్తు చేసే విద్యార్థుల సౌకర్యార్థం అధికారులు హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులు 040-23120416, వాట్సాప్ 7901002200 నంబర్లను అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ హెల్ప్ డెస్క్‌ల ద్వారా విద్యార్థులు తమ సమస్యలను నివృత్తిచేయాలని దోస్త్ కన్వీనర్, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి సూచించారు.

మిస్‌వరల్డ్ పోటీలకు ముస్తాబు

- **116 దేశాల నుంచి అందాల తారలు**
- **10న గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభం**
- **వివిధ చారిత్రక ప్రాంతాల్లో పర్యటించనున్న కంటెస్టెంట్లు**

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విదేశాల నుంచి వచ్చిన అందాల పోటీదారులు

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ): మిస్‌వరల్డ్-2025 పోటీలకు తెలంగాణ ముస్తాబైంది. ఈ నెల 10న సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. తెలంగాణ సంస్కృతి, వారసత్వం ప్రతిబింబించాలనే ఉద్దేశంతో నిర్వహించనున్న ఈ పోటీల్లో 116 దేశాల నుంచి అందాల తారలు పాల్గొననున్నారు. అమెరికా, ఆఫ్రికా, యూరప్, ఆసియా తదితర ఖండాల్లోని వివిధ దేశాలతోపాటు కరీబియన్ దీవులకు చెందిన పలువురు అందగత్తెలు తెలంగాణ ఆతిథ్యాన్ని స్వీకరించనున్నారు.

అందాల పోటీల షెడ్యూల్ వివరాలు (మే నెల)

- 10న సాయంత్రం 5 గంటలకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ప్రారంభం
- 12న ఆసియాకు చెందిన 28 మంది కంటెస్టెంట్లు నాగర్జునసాగర్, బుద్ధవనంలోని బౌద్ధ థీమ్ పార్క్ సందర్శన
- 13న: చార్మినార్, లాడ్‌బజార్‌లోని చారిత్రక వారసత్వ కట్టడాల సందర్శన అదేరోజు సాయంత్రం 6 గంటలకు చౌమహల్లా ప్యాలెస్‌లో విందు స్వీకరిస్తారు.
- 14న: సాయంత్రం ఐదు గంటలకు అమెరికాకు చెందిన 22 మంది వేయిస్తంభాల గుడి, వరంగల్ కోట సందర్శన.. యూరప్‌కు చెందిన 35 మంది పోటీదారులు అదేరోజు సాయంత్రం 4:30 గంటలకు రామప్ప ఆలయ సందర్శనకు వెళ్తారు.
- 15న: సాయంత్రం 5 గంటలకు కరీబియన్ దేశాలకు చెందిన 10 మంది యాదగిరిగుట్ట సందర్శనకు వెళ్తారు. అదేరోజు సాయంత్రం ఆఫ్రికా దేశాలకు చెందిన 25 మంది పోచంపల్లిలో హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్ ఎక్స్‌పోలో పాల్గొంటారు.
- 16న: మిస్‌వరల్డ్ పోటీదారులు హైదరాబాద్‌లోని మెడికల్ టూరిజం ప్రాంతాలకు వెళ్తారు. అదేరోజు అమెరికాకు చెందిన వారు మహబూబ్‌నగర్ జిల్లాలోని పిల్లలమర్రిని సందర్శిస్తారు.
- 17: గచ్చిబౌలి స్టేడియంలో ఫైనల్స్ పోటీలు.. అదేరోజు రామోజీ ఫిల్మ్‌సిటీ సందర్శన
- 18: ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంట్రల్ సందర్శన.. సాయంత్రం: సెక్రటేరియట్, ట్యాంక్ బండ్, తెలంగాణ తల్లి, నెక్లెస్‌రోడ్ వద్ద కార్నివాల్
- 20న: ఖండాలవారీగా పోటీదారుల ఫాస్ట్ ట్రాక్ సెలెక్షన్స్
- 20 లేదా 21న: ఐపీఎల్ సెమీఫైనల్స్ సందర్భంగా క్రికెట్ ఆడే దేశాలకు చెందిన 20 మంది ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో సందడి చేస్తారు.
- 21న: 35 మంది శిల్పారామంలోని డ్వాక్రా బజార్‌కు వెళ్తారు.
- 22న: 116 మంది కంటెస్టెంట్లు శిల్పకళా వేదికలో ప్రతిభను ప్రదర్శిస్తారు.
- 23న: ట్రైడెంట్ హోటల్ సందర్శన
- 24న: ట్రైడెంట్/హైటెక్స్‌లో ఫ్యాషన్, జ్యువెలరీ షోలో పాల్గొంటారు.. అదేరోజూ హైటెక్స్‌లో విందుకు హాజరవుతారు.
- 31: సాయంత్రం 5:30 గంటలకు రెడ్‌కార్పెట్ ఈవెంట్ ప్రారంభమవుతుంది. రాత్రి 10 గంటల నుంచి ఒంటి గంటవరకు ఫైనల్ పోటీలు నిర్వహించి, మిస్‌వరల్డ్ పోటీల విజేతను ప్రకటిస్తారు.
- జూన్ 2న: కొత్త మిస్‌వరల్డ్, ఆరు ఖండాల విజేతలు రాజ్‌భవన్‌లో జరిగే రాష్ట్ర అవతరణ వేడుకల్లో పాల్గొంటారు. కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరవుతారు.

మళ్లీ రెచ్చిపోయిన ఎమ్మెల్యే నాయిని అనుచరులు

- **హనుమకొండలో వీధి వ్యాపారులపై దాడి**

కర్రలతో దాడి చేస్తున్న ఎమ్మెల్యే అనుచరులు

నయీంనగర్, మే 5: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అనుచరులు మళ్లీ రెచ్చిపోయారు. హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ వద్ద వీధి వ్యాపారులపై విరుచుకుపడ్డారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇరవై ఏండ్లుగా రోడ్డు పక్కన వ్యాపారం చేసుకుంటూ బతుకీడుస్తున్న చిరు వ్యాపారులపై సదరు వ్యక్తులు దౌర్జన్యానికి దిగారు. 'ఇక్కడ మా వాళ్లు డబ్బాలు పెట్టుకుంటారు.. మీరు సహకరించాలి.. లేకపోతే మీ దుకాణాలు పోతాయి' అని హెచ్చరించారు. వీరి దౌర్జన్యంపై గత నెల 22న 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితం కావడంతో కొద్ది రోజులుగా సైలెంట్‌గా ఉన్నారు. అయితే ఆదివారం ఉదయం కొందరు ఎమ్మెల్యే అనుచరులు వచ్చి మహిళలు అని కూడా చూడకుండా ఇష్టం వచ్చినట్టు బూతులు తిట్టారు. 'బీరు సీసాలు తీసి మేం నాయిని మనుషులం. ఎమ్మెల్యే పీఏ కిరణ్‌కు అన్ని తెలుసు. ఎవ్వనికి చెప్పుకుంటావో చెప్పుకో' అంటూ ఇబ్బందులకు గురిచేసినట్టు బాధితులు తెలిపారు. ఈ క్రమంలో బాధితులు 100కు డయల్ చేయడంతో అక్కడికి చేరుకున్న హనుమకొండ పోలీసులు గొడవ చేస్తున్న వారితో.. 'మీ తరపున ఎమ్మెల్యే పీఏ కిరణ్ ఫోన్ చేశాడు.. మీరు ఇక్కడినుంచి వెళ్లిపోండి' అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇన్ని ఇబ్బందులు పెడుతుందని అనుకోలేదని, ఇప్పటికైనా నాయకులు, అధికారులు ఆలోచించి తమకు శాశ్వత పరిష్కారం చూపాలని బాధితులు వేడుకుంటున్నారు.

505 కోట్ల బకాయిలు ఇవ్వని సర్కారు!

- **రూ.10 లక్షల లోపు బిల్లులే.. చిన్న కాంట్రాక్టర్లకు మొండిచేయి**
- **చెల్లింపులు లేక ఆరు వేల మంది కాంట్రాక్టర్లకు తప్పని అవస్థలు**
- **ఇంకా ఆలస్యమైతే తాము రోడ్డున పడతామని ఆవేదన**

హైదరాబాద్, మే 5(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సివిల్ పనుల్లో విచిత్రమైన వాతావరణం నెలకొన్నది. బడా కాంట్రాక్టర్ల బిల్లులు చకచకా పాస్ అవుతుండగా, చిన్న కాంట్రాక్టర్ల బిల్లులు మాత్రం పెండింగ్‌లో ఉంటున్నాయి. దాదాపు ఆరువేల మంది చిన్న కాంట్రాక్టర్లకు సంబంధించిన రూ.505 కోట్ల బిల్లులు గత ఏడాదిన్నరగా పెండింగ్‌లో ఉన్నాయి. వివిధ శాఖల్లో సహజంగా చిన్న చిన్న పనులను మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా చేపడతారు. ఇవి నిరంతరం జరుగుతూనే ఉంటాయి కాబట్టి, బిల్లులు కూడా వెంటవెంటనే మంజూరవుతాయి. వీరంతా చిన్న కాంట్రాక్టర్లు కాబట్టి ఒక బిల్లు పాసైతే, ఆ వచ్చిన డబ్బులతో మరో పని చేపడతారు. ఇలా వేలాదిమంది కాంట్రాక్టర్లు ఆయా శాఖల్లో పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఈ విధానం పూర్తిగా అదుపుతప్పింది. బిల్లులు సకాలంలో మంజూరు కాక పోవడంతో వారు పనులు చేపట్టలేకపోతున్నారు. రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షలలోపు బిల్లులు కూడా నెలల తరబడి మంజూరు కావడంలేదు. ఇలా ఆరు ప్రధాన శాఖల్లో రూ.10 లక్షలలోపు బిల్లులు అన్నీ కలిపి సుమారు రూ.505 కోట్ల వరకు గత ఏడాదిన్నరగా పెండింగ్‌లో ఉన్నాయి. దాదాపు ఆరువేల మంది కాంట్రాక్టర్లకు సంబంధించిన ఈ బిల్లుల కోసం నిత్యం ఆయా శాఖల అధిపతులు, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు అనేకసార్లు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోతున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నదని, కాబట్టి బిల్లుల కోసం ఒత్తిడి చేయవద్దని అధికారులు సూచిస్తున్నారని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. నెల, రెండు నెలలంటే ఓపిక పడతాం కానీ, ఇంతకాలం ఎలా ఓపిక పట్టాలని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఒక్క బడా కాంట్రాక్టర్‌కు చెందిన బిల్లును ఆపితే ఆరు వేల మంది చిన్న కాంట్రాక్టర్ల బిల్లులన్నీ క్లియర్ అవుతాయని, ప్రభుత్వం తక్షణమే ఈ దిశగా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

సీఎం, ఆర్థిక మంత్రిని కలిసినా ఫలితం లేదు

పెండింగ్ బిల్లుల విడుదల కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రిని కలిసి విజ్ఞప్తిచేసినా ఫలితం లేకుండా పోయిందని తెలంగాణ సివిల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు వాపోయారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ రూ.10 లక్షల లోపువేనని, బిల్లులు పెండింగ్‌లో ఉండటంవల్ల ఆరు వేల మంది చిన్న కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తమకు ఒక బిల్లు క్లియర్ అయితేనే మరో పని చేపట్టే స్థోమత ఉంటుందని, అయినా ఏ నాయకుడూ, ఏ అధికారీ తమ బాధలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బిల్లులు వెంటనే మంజూరు చేయకుంటే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని, ప్రభుత్వం వెంటనే కలుగజేసుకొని ఆదుకోవాలని కోరుతున్నారు.

శాఖలవారీగా చిన్న కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లుల వివరాలు

ఆర్అండ్‌బీ శాఖ	రూ.100 కోట్లు
వాటర్‌బోర్డు	రూ.100 కోట్లు
ఆర్‌డబ్ల్యూఎస్	రూ.100 కోట్లు
పంచాయతీరాజ్	రూ.65 కోట్లు
మున్సిపల్ శాఖ	రూ.75 కోట్లు
ఇరిగేషన్ శాఖ	రూ.65 కోట్లు
మొత్తం	రూ.505 కోట్లు

రోటిబండతండాలో భారీగా మోహరించిన పోలీసులు

పోలీసు పహారా నడుమ రోటిబండతండాలో భూసర్వే

- **కొడంగల్‌లో పారిశ్రామిక వాడ ఏర్పాటుపై ముందుకు**
- **రైతులకు సమాచారం ఇవ్వని అధికారులు**
- **అన్నదాతలు లేకుండానే భూసర్వే పూర్తి**

బొంరాస్‌పేట, మే 5: పారిశ్రామికవాడ ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి భూములను సేకరిస్తున్నది. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం దుద్యాల, లగచెర్ల, హకీంపేట, పోలేపల్లి, రోటిబండ తండా, పులిచెర్లకుంట తండాల్లో భూసేకరణ కొనసాగుతున్నది. ఇందులో భాగంగా తహసీల్దార్ కిషన్ ఆధ్వర్యంలో సోమవారం రోటిబండతండాలో భారీ పోలీసు పహారా నడుమ అధికారులు సర్వే కొనసాగించారు. రోటిబండతండాలోని సర్వే నంబర్ 9లో మొత్తంగా 99 ఎకరాల 27 గుంటలకు సంబంధించి సర్వే పూర్తి చేసినట్టు తెలిపారు. తమకు సమాచారం ఇవ్వకుండానే అధికారులు సర్వే చేపట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సర్వే చేపడుతున్న క్రమంలో సమాచారం అందుకొన్న రైతులు తమ భూముల వద్దకు చేరుకున్నారు. గతంలో భూ సేకరణలో భాగంగా లగచర్ల ఘటన తలెత్తడంతో అధికారులు ముందస్తు చర్యగా పోలీసులను మోహరించి సర్వే నిర్వహిస్తున్నారు. భూ సర్వేను డీఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షించారు.